# 81. టైమెంతయింది?

వెనకటికి ఒక రైల్వే ప్లాట్ ఫారం మినీ కథ : -

ఒకాయన రైలు దిగి, ఊళ్లోకి వెళ్లిపోదామని గేటుదగ్గిర టికెట్టు అప్పగించి ఇవతల పడుతూ వుండగా ప్లాట్ ఫారం మీదినుంచి ఓ అబ్బాయి అడావుడిగా వొచ్చి ఆయన్ని ఆపేడట. ("అవి, రైల్వే స్టేషన్లలో ఎంక్వయిరీ కౌంటర్లు లేని రోజులు"- అని కథ బిగినింగు.) "సార్, ఇప్పుడు మీరు దిగిన రైలు విజయవాడ వైపునుంచీ కదండీ, వచ్చింది?"

"ఔను."

"ఇప్పుడు విజయవాడ వైపు వెళ్ళే రైలు ఏదీ లేదాండీ?"

"ఇప్పుడు లేదు, సరికదా; తెల్లారగట్ట నాలుగ్గంటల దాకా లేదు."

"ఇప్పుడు టైమెంతైందండి?"

పెద్దమనిషి వాచీ చూసి కూడా "నేను చెప్పను" అన్నాడట.

అబ్బాయి తెల్లబోయి "అదేం సార్?" అన్నాడట.

"చెప్తా" అని పెద్దమనిషి తన చేతిసంచీ అక్కడున్న ఒక బెంచీ మీద పెట్టి, టైమెంతయిందో చెప్పకపోవడానికి కారణం ఇలా వివరించేడుట. "టైమెంతయిందో చెప్పేననుకో. అప్పుడు నువ్వు; తెల్లారగట్ట నాలుక్కీ యిప్పటికీ మధ్య ఎన్ని గంటలు పడుతుందో లెక్క వేసుకుని - అంతసేపు ఇక్కడ ఎలాగో వెయిట్ చెయ్యాలన్నమాట - అంటూ జాలి మొహం పెడతావు. పోన్లే, అంతసేపు ఇక్కడ ఎలా వెయిట్ చేస్తావు పాపం; మా యింటికి రా - అంటాను. ఇంటికెళ్లేక మా ఆవిడ నాకు భోజనం పెడుతూ; "గుమ్మంలో ఉన్న ఆ అబ్బాయి అన్నం తిన్నాడో లేదో" అని జాలిపడి, నిన్నూ భోజనానికి పిలుస్తుంది. నువ్వూ నేనూ భోంచేస్తూ వున్న సమయంలో మా ఆవిడ నువ్వేం చదువుకున్నావో, ఏం పనిచేస్తున్నావో ఆరాలు తీస్తుంది. నువ్వు భోజనం చేసి వీధి గుమ్మంలో కెళ్ళేక - కుర్రాడు బుద్ధిమంతుడిలాగే ఉన్నాడండీ; మన అమ్మాయికి సంబంధాల కోసం తెగ తిరుగుతున్నారు కదా; ఈ అబ్బాయికే యిచ్చి చెయ్యకూడదటండీ - అంటుంది. నా కిష్టం ఉండదు. ఇహ అక్కణ్ణించి నాకూ మా ఆవిడకీ మధ్య పెద్ద గొడవై పోతుంది."

"పోనీ ఆవిడ చెప్పినట్టే చెయ్యొచ్చు కదండీ?"

"చెయ్యొచ్చుననుకో. అయితే ఇంత బతుకూ బతికి ఇంటివెనకాల చచ్చిపోయాడన్నట్టు - చేతికి వాచీ అయినా లేని నీలాంటి నిర్భాగ్యుడికా, పిల్లనిచ్చి పెళ్లి చెయ్యడం?"

ఇప్పుడంటే నగర జనాభాలో సగం మందికి పైగా చేతులకి వాచీలు పెట్టుకోగలుగుతున్నారు కానీ పాతిక ముప్ఫయ్యేళ్ల కిందట వాచీ కూడా అపురూపమైన వస్తువుగానే ఉండేది. 1965 ప్రాంతంలో నేను నరసారావు పేటలో పని చేస్తున్నప్పుడు నేనూ, గంధం శర్మగారూ, చోడా కోటేశ్వరరావుగారూ: కోలవెన్ను వారింటి ముందర నిలబడి వుండగా ఓ అబ్బాయి మా దగ్గిరకొచ్చి టైమెంతయిందని అడిగాడు. మా ముగ్గురి చేతులకీ వాచీలున్నాయి. ఇద్దరు డాక్టర్లు

ఒక రోగి రోగం గురించి ఒకే రకం డయాగ్నొసిస్ చెయ్యరన్నట్టు ఏ రెండు వాచీలూ ఒకే టైమ్ చూపించవని అంటారు. ఈ సూత్రం ప్రకారమే కాబోలు; మా ముగ్గురి వాచీలూ మూడు టైములు చూపించేయి. అప్పుడు సంభాషణ ఎలా నడిచిందని:-

కోటేశ్వరరావు : ఏడూ, పదినిమిషాలు!

గంధం శర్మ : సరిగ్గా ఏడు!

నేను : ఐదు నిమిషాలు తక్కువ ఏడు.

ఆ అబ్బాయి : ఏదో పెద్ద మనుషులు కదా అని టైము అడిగినందుకు మా గొప్ప దెబ్బకొట్టేర్లెండి. పదినిమిషాలు ఏడవమని వొకరూ, సరిగ్గా ఏడవమని మరొకరూ, సరిగ్గా ఏడ్చే పక్షంలో ఐదు నిమిషాలు తక్కువగా ఏడిచినా పర్లేదని యింకొకరూ! ఇంక జన్మలో ఎవర్నీ టైమెంతైందని అడక్కుండా బుద్ధి చెప్పేరు.

(ఈ విషాద గాథ నండూరి రామమోహనరావు గారికి చెప్తే ఆయన "వేళా విశేషం" అని "జ్యోతి"లో ప్రచురించారు)

వేళా విశేషం అంటే విషాదమే కాదు. వినోదంకూడా వుందని ఇంకో టైము జోకు చెప్తుంది. అదెలాగంటేను -

సుమారు పదీ పన్నెండేళ్ల వయసున్న ఓ హోటల్ క్లీనరు తను డ్యూటీ దిగిపోయే టైము అయిందో లేదో చెకప్ చేసుకుందామన్న సదుద్దేశంతోనో సదసత్సంశయంతోనో; అప్పుడే టిఫిన్ తిని కాఫీ తాగి బ్రేవుమని తేన్చిన ఓ భారీ మనిషిని "సార్, టైమెంతయింది సార్?" అని అడిగేడుట. ఆ పెద్దమనిషి ఆ కుర్రాడి వీపుమీద ఒక్క గుద్దు వేసి "ఇంత!" అన్నాడుట. కుర్రాడు చెక్కుచెదరకుండా "ఇంకా నయం! ఓ గంట కిందట అడిగేను కాదు; చచ్చుందును" అన్నాడట.

ఓసారి విశాఖపట్నం ఏవీయన్ కాలేజి బస్టాపు దగ్గిర నేను నిలుచుని ఉండగా జరిగిన ఉదంతం కూడా చెప్పాలి........ నాతో బాటుగా ఆ స్టాపులో ఓ 17,18 ఏళ్ల కుర్రాడు నించున్నాడు. నిమిషానికోమాటు అతను తన చేతి గడియారం వేపు చూసుకుంటూ ఉంటే "ఏం అబ్బాయీ, ఏదైనా అర్జంటు పనుందా? ఇంకో పావుగంట దాకా 13 (నెంబరు బస్సు) రాదు" అన్నాను. ఆ అబ్బాయికి నా మాటలు ఏమీ వినిపించలేదని తెలిసింది. ఎందుకంటే "మరేనండీ, కొత్తదే. ఇవాళ ఉదయమే మా బావగారు కొనిచ్చేరు." అన్నాడు చేటంత మొహం చేస్కుని. ఇంతలో ఒక ఆంగ్లో ఇండియన్ ఆవిడ అతనికి దగ్గిరగా వచ్చి; "మిస్టర్, వాట్స్ ద టైమ్?" అంది. ఆ అబ్బాయికి ఆ మాట వినబడింది. వెంటనే నూట యాభై ఆరోసారి ఆ వాచీ చూసుకుని; టైం ఎంతైందో తెలుసుకుని - "టెంటు టెంటు టెంటు టెన్ టెంటు టెన్!" అని; "పది నిమిషాలు తక్కువ పది" అనడానికి ఇంగ్లీషు అనువాదం నిర్వహించేడు. అందం, అపురూపం ఎంతటి వాడినైనా గాభరా పెడ్తాయి. ఆ కుర్రాడనగా ఎంత!

చేతి గడియారానికి టైమెంతైందో తెలియజేసే లక్షణమే కాక అన్యాపదేశంగా అభిప్రాయం చెప్పే స్వభావం కూడా ఉంది. ఎవరైనా మనకి అట్టే ఇంటరెస్టు లేని టాపిక్కును గురించి మాట్లాడుతున్నప్పుడు "ఊఁ. అవును. అలాగే. కాదుమరీ?" అంటూ స్పందించుకుంటూ పోయినా

ఆ స్పీకర్‌కి ఏమీ తట్టకపోవచ్చు గాని; కొంతసేపు గడిచేక ఒకసారి వాచీ వేపు చూస్తే అతని స్పీచి అపమనే రిక్వెస్టుగా అది పని చేయవచ్చు.

ఒకానొక రాజకీయోపన్యాసకుడు తన సుదీర్ఘ ప్రసంగం ముగిస్తూ : "శ్రోతలు క్షమించాలి. అనుకోకుండా కొంచెం ఎక్కువసేపు మాట్లాడినట్టున్నాను. నా గడియారం ఆగిపోయింది. చూసుకోలేదు." అన్నాడట. ప్రేక్షకుల్లోంచి ఒకరు, "గడియారం సంగతి సరే! వెనకాల అంత పెద్ద కేలండరుంది. అదీ కనబల్లేదా?" అన్నారట. ★

# 82. బతక నేర్చిన బాబు

**నే**ను పనిచేసిన ఆఫీసులో బాబూరావు అని ఒకతను ఏడేళ్ల కిందట సీనియర్ గుమస్తాగా ఉండేవాడు. "ఆఫీసు పని అంటే పరమపదసోపానపటం లాంటిది. పని అనేది పాముల్లాంటిది. కెరియర్ అనేది నిచ్చెనలాంటిది.అంచేత పని అనే పాములు మనల్ని మింగకుండా కెరీరు అనే నిచ్చెనలు ఎక్కిపోవడమే ఆఫీసుల్లో ఉద్యోగాలు చేసేవాళ్ల ధ్యేయంగా పెట్టుకోవాలి" అని అతని సిద్ధాంతం. ఉదయం అటెండెన్సు రిజిస్టర్‌లో సంతకం పెట్టాక కొన్ని నిముషాలు శ్రద్ధగా తన సీట్లో కూర్చున్నాకనే అసిస్టెంటు మేనేజర్ దగ్గరి కెళ్తాడు. "సార్, మీకు యూనివర్శిటీ ఏరియాలో ఏదైనా పనుంటే చెప్పండి సార్" అని జేబులోంచి ఒక కాగితం తీస్తాడు. ఎ.ఎమ్ (అసిస్టెంటు మేనేజర్) యూనివర్శిటీ ఏరియా ఏమిటి, తనకి ఏదైనా పనుండడమేమిటి? ఉంటే మాత్రం ఆ వివరాలు బాబూరావుకి చెప్పడమెందుకు - అని ఆలోచించే లోపల :

"ఏంలేదు సార్. లోగడ మీకు చెప్పాను కదా. మా మేనకోడలు ఏలూర్నించి వచ్చి ఇక్కడ బీకామ్ పరీక్ష రాయడం, అదంతాను. ఆ అమ్మాయి ఫస్టుక్లాసులో పాసైందని పేపర్లో వేసిన రిజల్టు చూస్తే తెలిసిందిట. కాని, నెలరోజులు దాటిపోయినా మార్కుల షీటు చేరలేదుట. ఓసారి వెళ్లి కనుక్కుని రావాలి సార్."

ఎ.ఎం. గారు మళ్లీ ఆలోచనలో పడతారు. ఆ అమ్మాయి (అదే, బాబూరావు మేనకోడలు) ఏలూరు నుండి రావడం; బి.కాం. పరీక్ష ఇక్కడ రాయడం ఇతను తనకి చెప్పాడా. చెప్తే తనకెందుకు గుర్తు రావడం లేదు - అలా అలా.

బాబూరావు తన జేబులోంచి తీసి పట్టుకున్న కాగితం ఎ.ఎం.గారి ముందు రెపరెపలాడిస్తూ "అదే సార్. ఆ మధ్య మీ అమ్మాయికి చినవాల్తేరులో ఏదో సంబంధం వచ్చిందనీ, ఆ అబ్బాయి రాయపూర్‌లో పనిచేస్తున్నాడనీ, దసరాకి వస్తాడనీ అన్నారు కదా. అట్నుంచి అటు వెళ్లి ఆ అబ్బాయి ఊళ్లోకి వచ్చాడో లేదో కనుక్కుని వచ్చేస్తాను సార్!"

"నాకు ఒక గంటసేపు బైట పన్లున్నాయి గనుక, దయచేసి పర్మిషన్ ఇవ్వమని ప్రార్థిస్తున్నాను" అని కాగితం మీద పెట్టకుండా, కనీసం నోటితోనయినా అడక్కుండా అలా ఆయమాయ గారడీలు చేసి వెళ్లిపోవడం బాబూరావు ప్రత్యేకత. అతను వెళ్లిన పావుగంటకో అరగంటకో ఎ.ఎం. గారికి బాబూరావు పెట్టిన ఫైల్లో ఏదో సందేహం వచ్చి అతన్ని పిలవమంటారు; ఎవరో ఒకరు ఆయన కేబిన్‌లోకి వెళ్లి మీరే కదండి సార్, అతనికి గంట పర్మిషనిచ్చి పంపేరు?